సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 23: కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లో పెన్నార్ పరిశ్రమ యాజమాన్యం నిర్వహించిన చౌడమ్మ దేవీ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, యాజమాన్యం మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు ఉన్నప్పుడే పరిశ్రమ అభివృద్ధిపథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో నిరంతరం అండగా ఉంటామని చెప్పారు. పెన్నార్ యాజమాన్యం కార్మికుల సమస్యల విషయంలో ఎప్పుడూ సానుకూల ధోరణితో ఉండడం సంతోషకరమని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ ఫండ్‌ని కేటాయిస్తూ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు, పరిశ్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరియాదవ్, పరిశ్రమ డైరెక్టర్ లావణ్యకుమార్ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు టీనా కృషి

మేళ్ల చెరువులో చెత్తాచెదారాన్ని తొలిగించిన టీనా సభ్యులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు

రామచంద్రాపురం, జూన్ 23: చెరువుల పరిరక్షణకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ కృషి చేస్తున్నదని అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసరాల్లో టీనా ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీ వాసులు స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలిగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. చెరువుల పరిసరాల్లో చెత్తను వేయవద్దన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రతి ఆదివారం టీనా ఆధ్వర్యంలో స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ వాసులు ప్రతి ఆదివారం స్వచ్ఛసర్వేక్షణ్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

పక్కకు జరుగు అన్నందుకు దాడి

కంకోల్ వాసిపై పంజాబ్ వ్యక్తి తల్వార్‌తో దాడి

చికిత్స పొందుతున్న విజయ్

మునిపల్లి, జూన్ 23: రోడ్డుకు అడ్డంగా నిలబడ్డావు, కొంచెం పక్కకు జరుగు అన్నందుకు మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని కంకోల్ శివారులోని ముంబయి జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన పట్లోళ్ల విజయ్ ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి వైపు నుంచి కంకోల్ వైపు వెళ్తున్న క్రమంలో టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనాలు వెళ్లే దారిలో పంజాబ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా నిలబడి ఫొటోలు తీస్తున్నాడు. పక్కకు జరుగు అని అన్నందుకు పంజాబ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి వారి భాషలో బూతులు తిట్టాడు. ఎందుకు తిడుతున్నావ్ అని విజయ్ నిలదీయడంతో పక్కన ఉన్న తన కారులో నుంచి రాడ్ తీసి కొట్టడమే గాక, కారులో ఉన్న తల్వార్ తీసి విజయ్ ఒంటిపై దాడి చేశాడు. టోల్‌ప్లాజా వద్ద ఘర్షణ జరుగుతుంది రమ్మని విజయ్ తన తమ్ముడికి కాల్ చేసి విషయం చెప్పడంతో టోల్‌ప్లాజా వద్దకు విజయ్ తమ్ముడు చేరుకోగానే పంజాబ్‌కు చెందిన వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడు బుధేరా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వృథాగా పోతున్న భగీరథ నీరు

హత్నూర, జూన్ 23 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నది. రోజూ నీరు వృథాగా పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల నుంచి తాగు నీరంతా పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్నదని వాపోతున్నారు. దీంతో తాగునీరు కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థి ప్రతిభకు బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న విద్యార్థి ఇమ్రాన్

కోహీర్, జూన్ 23: మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో 10 పాయింట్లు సాధించిన ఇమ్రాన్‌నను ఘనంగా సత్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నెహ్రూ ఆడిటోరియంలో ఉర్దూ అకాడమీ జెడ్డా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇమ్రాన్‌కు బంగారు పతకాన్ని అందజేశారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతోపాటు ఎన్‌సీసీలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. దీంతో విద్యార్థికి బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జాకీర్‌హుసస్సేన్, ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- రోడ్లపైకి మురికి నీరు.. రోజంతా దుర్గంధం
- దోమల బెడద.. విష సర్పాల సంచారం
- వర్షాకాలం.. రోగాలు ప్రబలే ప్రమాదం
- అధికారులు గుర్తించి పరిష్కరించాలంటున్న జనం

గ్రామాల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన ■ ఎక్కడపడితే అక్కడ పిచ్చి మొక్కలు

నేరడిగుంటలో ఇండ్ల మధ్య పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

అందోల్, జూన్ 23: చిన్నపాటి వర్షాలకే వీధుల్లో అంతర్గత రోడ్లు చిత్తడిగా మారి మురికినీరు రోడ్లపైకి చేరుతున్నది. ఎక్కడ పడితే అక్కడ పిచ్చి మొక్కలు.. రోజంతా దుర్గంధం.. రాత్రైతే దోమల బెడద, విష సర్పాల సంచారంతో భయంతో బతకాల్సి వస్తున్నదని నేరడిగుంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో సమస్యలు పరిష్కరించాల్సిన ప్రత్యేక అధికారులు సరైన దృష్టి పెట్టడంలేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో పరిశుధ్యం లోపించి కొత్తకొత్త రోగాలు ప్రభలే అవకాశం ఉన్నదంటూ ఆందోళన చెందుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు.

అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించడం లేదు. గ్రామంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. డ్రైనేజీలు నిండిపోయి రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్నది. ఇండ్ల మధ్యలో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు ఇండ్లలోకి వస్తున్నాయి. రాత్రైతే దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. పలు సమస్యలపై ప్రత్యేక అధికారులతోపాటు మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. జిల్లా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

- శ్రీధర్‌రెడ్డి, నేరడిగుంట

కంపుకొడుతున్న వీధులు

సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన సంగతీ తెలిసిందే. ప్రత్యేక అధికారుల పాలన మొదలైన నాటినుంచి తమకు కష్టాలు వచ్చాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడం, వీధుల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోవడం, మురికి కాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తున్నది. దోమల బెడద, విష సర్పాల సంచారంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సి వస్తున్నదని వాపోతున్నారు. సర్పంచ్‌లు ఉన్నప్పుడు సమస్యలుంటే పరిష్కరించేవారని, ఇప్పుడు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

వారం క్రితం తైబజార్ వేలంపాటలో పంచాయతీకి రూ.4 లక్షలకు పైగా ఆదాయం వచ్చిన విషయంపై ఎవరికీ సరైన సమాచారం ఇవ్వలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్యలను గ్రామాల్లోకి వచ్చిన అధికారులకు వివరిస్తే సరైన స్పందన లేదని.. మండలాధికారులకు చెబుదామంటే గ్రామంలో ప్రత్యేక అధికారులకు చెప్పాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నాయి. వీధుల్లో పేరుకుపోయిన చెత్త.. రోడ్లపై పారుతున్న మురికి నీరు, అస్తవ్యస్త పారిశుధ్య నిర్వహణతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేరడిగుంటలో చెత్తాచెదారంతో నిండిపోయిన మురికి కాల్వ

గాడిద పాలను విక్రయిస్తున్న వ్యాపారులు

గాడిద పాలకు భలే డిమాండ్

న్యాల్‌కల్, జూన్ 23: 'గంగి గోవు పాలు గరిటెడైనను చాలు.. కడివడైననేమి కరము పాలు' ఇది ఒకప్పుడు చదువుకున్న పద్యపాదం. అవు పాల ముందర గాడిద పాలు ఎందుకూ పనికిరావని దీని అర్థం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. గాడిద పాలకు ఫుల్ డిమాండ్ వచ్చింది. పిల్లల్లో దగ్గు, ఆయాసం తగ్గడానికి వీటిని వినియోగిస్తుండడంతో లీటరు పాలు రూ.10 వేలు పలుకుతున్నాయి. పది మి.లీ. తాగిపిస్తే దగ్గు, ఆయాసం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు నయమవుతాయని విక్రయదారులు అంటున్నారు. ఆదివారం కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన పలువురు మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, ముంగి, గంగ్వార్ తదితర గ్రామాల్లో గాడిద పాలను విక్రయించారు. పిల్లలు ఉన్న ఇండ్ల వద్దకు వెళ్లి అక్కడికక్కడే పాలను పితికి ఇచ్చారు. ఒక్క గాడిద రోజుకు 200 మి.లీ నుంచి 250 మి.లీ వరకు ఇస్తుంది. దీంతో 10 మి.లీ. పాలు రూ.100 నుంచి 120 వరకు అమ్ముతున్నారు. ఇలా ప్రతిరోజూ ఏదో ఒక గ్రామానికి వెళ్లి పాలను విక్రయిస్తూ రోజుకు రూ 1,000ల నుంచి 2,000 వరకు సంపాదిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. గాడిద పాల గురించి తెలిసిన వారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, గిరాకీ ఉంటే ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

కాలుష్యంపై పోరాటానికి జేఏసీ ఏర్పాటు

జేఏసీతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాది దండె రమాకాంత్

జిన్నారం, జూన్ 23: ఖాజీపల్లి గ్రామాన్ని పట్టి పీడిస్తున్న కాలుష్య సమస్యపై పోరాటానికి జేఏసీ ఏర్పాటైంది. ప్రముఖ న్యాయవాది, పర్యావరణవేత్త దండె రమాకాంత్ ఆధ్వర్యంలో గ్రామ యువకులతో కలిసి పది రోజులుగా గ్రామంలో వార్డుల వారీగా ర్యాలీలు నిర్వహించారు. కాలుష్య సమస్యపై అవగాహన కల్పించారు. ఆదివారం గ్రామంలో దండె రమాకంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జేఏసీని ఏర్పాటు చేశారు. కాలుష్యంపై పోరాటానికి జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. జేఏసీ, గ్రామస్తులతో కలిసి హనుమాన్ ఆలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఎలాంటి స్వార్థం లేకుండా గ్రామాన్ని కాపాడుకోడానికి, పిల్లల భవిష్యత్ కోసం కాలుష్యాన్ని రూపుమాపడానికి, పరిశ్రమలను ఇక్కడి నుంచి శాశ్వతంగా తరలించడానికి దేనికైనా సిద్ధమని ప్రతిజ్ఞ చేశారు. త్వరలోనే జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవిస్తామని రమాకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో ప్రభాస్ రానున్నారని చెప్పారు. కాలుష్య సమస్యపై ఎన్‌జీటీ, సుప్రీం కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో తన ప్రాణాలు పోయినా వెనక్కి తగ్గేది లేదని చెప్పారు. ఎంపీ బండి సంజయ్ కూడా ఢిల్లీలో సుప్రీం కోర్టుకు వచ్చినప్పుడు పూర్తిగా సహకరిస్తానని మాటిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భార్గవ్, నాయకులు అశోక్, మైలారం భీమ, మహేశ్, నరేశ్, సురేశ్, కుమార్‌యాదవ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో మద్యం పట్టివేత

కోహెడ, జూన్ 23: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామంలోని కిరాణాదుకాణాల్లో మద్యం అమ్ముతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని వేముల చంద్రమౌళి, వేముల మల్లేశం,బుక్క చంద్రం,మౌటం నాగరాజు, పోలోజు సంపత్ తమ దుకాణాల్లో మద్యం అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు కోహెడ పోలీసులతో కలిసి మద్యాన్ని పట్టుకున్నట్లు వారు తెలిపారు. మొత్తం 147.760 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు వారు వివరించారు.

భక్తిశ్రద్ధలతో రాధాగోవింద రథయాత్ర

రాధాగోవింద రథయాత్రకు హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు

కోహీర్, జూన్ 23: జహీరాబాద్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్వర్యంలో రాధాగోవింద రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాజీ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జాతీయ రహదారి గుండా శోభయాత్ర చేపట్టారు. ఆర్టీసీ బస్తాండ్ సమీపంలోని షెట్కార్ ఫంక్షన్ హాలు వద్ద రథయాత్రను ముగించారు.

అందరూ ప్రశాంతంగా జీవించాలి

ప్రజల జీవిత కాలం చిన్నదని, ప్రతిఒక్కరూ ఉన్నన్ని రోజులు సుఖ, సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆకాంక్షించారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్వర్యంలో చేపట్టిన రాధాగోవింద రథయాత్రకు హాజరూ మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. జహీరాబాద్ ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు గుండప్ప, అల్లాడి నర్సింహులు, విజయ్‌కుమార్, తట్టు నారాయణ, వెంకటేశం, నామ రవికిరణ్ గుప్తా, నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు సన్మానం

న్యాల్‌కల్, జూన్ 23: జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్‌ను కాంగ్రెస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ స్వగృహంలో ఆయన్ను కలిసి శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసోద్దీన్, నాయకులు షఫీయొద్దీన్, రఫీయొద్దీన్, కరమత్ అలీ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, జూన్ 23: మండల కేంద్రం జిన్నారంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, నక్క నరేందర్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో బర్రె మృతి

లింగాపూర్‌లో కరెంట్ షాక్‌తో మృతిచెందిన బర్రె

హత్నూర, జూన్ 23: కరెంట్ షాక్‌తో బర్రె మృతి చెందిన ఘటన హత్నూర మండలం లింగాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవుక నర్సింహులుకు చెందిన బర్రె గ్రామ శివారులో మేత మేస్తుండగా స్తంభానికి దాపుగా అమర్చిన విద్యుత్‌తీగకు కరెంట్ సరఫరా కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై మృతి చెందింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

శుభ్రతతోనే జబ్బులు దూరం

- వానాకాలం.. సీజనల్ వ్యాధులతో భద్రం
- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవంటున్న వైద్యులు

మునిపల్లి, జూన్ 23: పాఠశాలలకు వెళ్లే సమయంలో చిన్నారులు ఉరుకులు.. పరుగుల మీద హడావిడిగా వెళ్తుంటారు. ఉదయం ఏడు గంటలు మొదలు రాత్రి వరకు చిన్నారులు బిజీబిజీ. ఈ హడావుడిలో వారి శుభ్రత, తిండితిప్పల గురించి ఏమాత్రం అశ్రద్ధ చేసినా అంటురోగాలు, వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రాథమిక దశలో విద్యార్థికి ఏం కావాలి, తల్లిదండ్రులు, పాఠశాలల బాధ్యత ఏమిటి? తదితర అంశాలపై అవగాహన తప్పనిసరి ఉండాలి.

పొద్దున లేవగానే..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే చిన్నారుల ఆలనాపాలన తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలపైనే ఉంటుంది. వీరిలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేసినా పిల్లల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. పొద్దున ఆరు గంటల్లోపే చిన్నారులను నిద్ర లేపి మంచి నీళ్లు తాగించాలి. కాలకృత్యాలు పూర్తి చేయించాలి. ఈ దినచర్యలో నిర్లక్ష్యం వహించరాదు.

శుభ్రంగా బ్రష్ చేస్తున్నారా?

చిన్నారులు సక్రమంగా బ్రష్ చేస్తున్నారా లేదా అని తల్లిదండ్రులు తప్పక గమనించాలి. నీళ్లు నోట్లో పోసుకొని పుక్కిలించే సమయంలో కొంతమంది చిన్నారులు నీళ్లను మింగేస్తుంటారు. ఐదేండ్ల లోపు పిల్లలను ప్రత్యేకంగా గమనించాలి. పేస్టుని బ్రష్‌పై వేసుకుని తింటున్నారా కనిపెట్టాలి. బ్రష్ చేసే సమయంలో పళ్ల నుంచి రక్తం వస్తుందా, లేదా అని చూడాలి. బ్రష్‌ను వేడి నీళ్లతో శుభ్రం చేయాలి. బ్రష్ చేశాక తడి తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. దీనిపై నిర్లక్ష్యం చేస్తే నోటి సమస్యలు, గొంతు ఇన్‌ఫెక్షన్, కడుపు నొప్పి లాంటి పలు సమస్యలు వస్తుంటాయి.

వేడివేడి భోజనం పెట్టాలి

చిన్నారులకు పెట్టే భోజనం వేడివేడిగా ఉండాలి. నిల్వ ఉంచిన భోజనాన్ని పెట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు ఆడుకున్న తర్వాత చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే తినిపించాలి.

చిన్నారులకు తినిపించే సమయంలో తినిపించే వారు సైతం చేతులు శుభ్రం చేసుకోవాలి. శుభ్రత పాటించడంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేసినా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది.

పాఠశాలల్లో ఇవి తప్పనిసరి

ఉదయం, సాయంత్రం వేళల్లో, పాఠశాల విరామ సమయాల్లో యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు క్రీడా మైదానాల్లో వారికి తోచినట్లు ఆడుతుంటారు. ఆట తర్వాత స్నాక్స్, ఇతర ఆహారం తినే ముందు కచ్చితంగా చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కునేలా ఏర్పాట్లు చేయాలి. స్కూల్స్‌లోకి రెడీమేడ్ ఫుడ్, ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొచ్చే తినుబండారాలను అరికట్టాలి.

స్నానం చేయించేటప్పుడు

గోరువెచ్చని నీళ్లతో రెండు పూటలా స్నానం చేయించాలి. ఉదయం స్కూల్‌కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా స్నానం చేయించాలి. దుస్తులు వేసేముందు వారికి గ్లాసు పాలు, టిఫిన్ ఇవ్వాలి. ఉదయాన్నే ఆయిల్ ఫుడ్ ఇస్తే మత్తుగా తరగతి గదిలో నిద్రపోయే అవకాశం ఉంటుంది. టై, బెల్ట్‌లు జారిపోతాయేమోనని టైట్‌గా బిగించి కట్టవద్దు.

శుభ్రతపై దృష్టి సారించాలి

ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు పిల్లల శుభ్రతపై దృష్టి సారించాలి. నిద్ర లేవగానే బ్రష్ చేయించాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయించి శుభ్రమైన బట్టలు తొడగాలి. లంచ్ బ్యాగ్ సిద్ధం చేసి ఇంటికి రాగానే గోరువెచ్చని నీళ్లతో మళ్లీ స్నానం చేయించి వేడివేడిగా పౌష్టికాహారం అందించాలి. చిన్నారులు త్వరగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు. కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ మనూజరెడ్డి, మునిపల్లి పీహెచ్‌సీ